సాక్షి
పశ్చిమగోదావరి
బుధవారం | 20 | ఆగస్టు | 2025



**శ్రీవారి భక్తులకు రహదారి కష్టాలు**

చినవెంకన్న దర్శనానికి వెళ్లే భక్తులు అప్రమత్తంగా లేకుంటే ప్రమాదాల బారిన పడటం ఖాయం. భీమడోలు–ద్వారకాతిరుమల **రహదారి అధ్వానంగా మారింది.** 8లో ▸



**దోమ కాటు ప్రాణాంతకమే**

భారీ వర్షాలకు దోమలు విజృంభిస్తున్నాయి. దీంతో వ్యాధుల బారిన పడుతున్నారు. సకాలంలో చికిత్స చేయకపోతే ప్రమాదమని వైద్యులు చెబుతున్నారు. 8లో ▸



**కోర్టుల్లో ఉద్యోగాలకు పరీక్షలు**

ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా కోర్టుల్లో స్టెనోగ్రాఫర్స్, టైపిస్ట్ తదితర పోస్టులకు ఈ నెల 20 నుంచి పరీక్షలు నిర్వహిస్తున్నట్లు **ప్రధాన న్యాయమూర్తి** తెలిపారు. 8లో ▸

# దివ్యాంగ పింఛన్లకు కోత

- డిజేబుల్డ్, ఆరోగ్య పింఛన్లు తగ్గించే పనిలో చంద్రబాబు సర్కారు
- కొన్నింటిని ఓఏపీ పింఛన్లుగా మార్పు
- నడవలేని వారికి సైతం వైకల్యం 40 శాతం లోపుందని నోటీసులు
- ఆరోగ్య పింఛన్ లబ్ధిదారుల్లో సగానికి పైగా కత్తెర



కుమార్‌రాజాకు వచ్చిన నోటీస్ చూపిస్తున్న దృశ్యం

ఈ ఫొటోలో కనిపిస్తున్న అబ్బాయి పేరు కుమార్‌రాజా. వయస్సు ఆరేళ్లు. నరసాపురం రూరల్ ఎల్‌బీ చర్లకు చెందిన ఈ బాబుకు పుట్టుక నుంచే మెదడులో సమస్యతో కాళ్లు, చేతులు సరిగా పనిచేయవు. నడవలేడు. ఎక్కడికైనా ఎత్తుకుని తీసుకువెళ్లాల్సిందే. అన్నం కూడా ఎవరైనా తినిపించాల్సిందే. గతంలో విజయవాడలోని ప్రభుత్వ ఆస్పత్రిలో 90 శాతం వైకల్యం ఉన్నట్లు వైద్యులు నిర్ధారించడంతో గత ప్రభుత్వంలో దివ్యాంగ పింఛన్ మంజూరైంది. ఇటీవల చేసిన రీ వెరిఫికేషన్‌లో తాత్కాలిక వైకల్యంగా నిర్ధారణ అయ్యిందని, పింఛన్ నిలిపివేస్తున్నట్టు ఎంపీడీఓ కార్యాలయం నుంచి నోటీసు అందింది. ఎల్‌బీ చర్ల గ్రామంలో 65 దివ్యాంగ పింఛన్లకు 14 మందికి నోటీసులు జారీ చేయడం గమనార్హం.

సాక్షి, భీమవరం : ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు 50 ఏళ్లకే వృద్ధాప్య పింఛన్ హామీని గాలికొదిలేసిన చంద్రబాబు సర్కారు ప్రస్తుతం ఉన్న పింఛన్లు, ఇస్తున్న సాయానికి కోత పెట్టే పనిలో పడింది. తొలి విడతగా దివ్యాంగ, ఆరోగ్య పింఛన్లపై కన్నేసింది. జిల్లాలో దివ్యాంగ పింఛన్ లబ్ధిదారులు 27,193 మంది ఉండగా పక్షవాతం, కిడ్నీ, లివర్ ఇతర ఆరోగ్య సమస్యలతో పింఛన్ పొందుతున్న వారు 1,581 మంది వరకు ఉన్నారు. దివ్యాంగులకు నెలకు రూ.6,000, ఆరోగ్య పింఛన్ లబ్ధిదారులకు రూ.15,000, ఇతర సామాజిక పింఛన్లకు రూ.4,000 చొప్పున సాయం అందుతోంది. వెరిఫికేషన్, రీ అసెస్‌మెంట్ పేరిట లబ్ధిదారులకు ఇటీవల వైద్య బృందాలతో వైకల్య నిర్ధారణ, ఆరోగ్య పరీక్షలు చేయించారు. ఆరోగ్య పింఛన్ లబ్ధిదారులు 1,510 మందికి పరీక్షలు చేసి రూ.15,000 సాయం పొందేందుకు 566 మంది మాత్రమే అర్హులుగా నిర్ధారించారు.

**పింఛన్ నిలిపివేస్తామంటూ నోటీసులతో ఆందోళన**

మిగిలిన వారిలో 603 మందిని దివ్యాంగ పింఛన్లకు, 341 మందిని వృద్ధాప్య పింఛన్లకు మార్పుచేశారు. ఈ మేరకు వారికి అందించే సాయం భారీగా తగ్గనుంది. 15,596 మంది దివ్యాంగులకు పరీక్షలు నిర్వహించి 13,690 మంది మాత్రమే అర్హులుగా తేల్చారు. 1,289 మందిని వృద్ధాప్య పింఛన్లకు మార్పుచేయగా మిగిలిన వారికి తాత్కాలిక వైకల్యంగా, 40 శాతం లోపు ఉన్నట్టుగా సర్టిఫికెట్లు జారీచేయడంతో ఇప్పుడు వారి పింఛన్లు ఆగిపోయే పరిస్థితి వచ్చింది. వీరిలో పుట్టుక నుంచి వైకల్యంతో బాధపడుతున్న వారు, ఎన్నో ఏళ్లుగా పింఛన్ తీసుకుంటున్న వారు ఎంతోమంది ఉన్నట్టు చెబుతున్నారు. వైకల్య శాతం తక్కువ, తాత్కాలిక వైకల్యం కారణంగా పింఛన్ నిలిపివేస్తున్నట్లు మండల పరిషత్, మున్సిపల్ కార్యాలయాల నుంచి నోటీసులు అందడం లబ్ధిదారులను ఆందోళనకు గురిచేస్తోంది. నోటీసులు తీసుకుని సహాయకులతో కలిసి ప్రభుత్వ కార్యాలయాలకు పరుగులు తీస్తున్నారు.

### 15 నెలల్లో ఒక్క పింఛన్ లేదు

పాలన చేపట్టిన 15 నెలల కాలంలో కూటమి ప్రభుత్వం ఒక్క కొత్త పింఛన్ మంజూరు చేయకపోవడం గమనార్హం. చివరిగా 2024 జనవరిలో గత ప్రభుత్వం 4,274 కొత్త పింఛన్లు మంజూరు చేసింది. జూలైలో కొత్తవి మంజూరు కావాల్సి ఉండగా జూన్‌లో కూటమి రాకతో వాటికి బ్రేక్ పడింది. జూన్ నాటికి జిల్లాలో 2,32,885 మంది పింఛన్ లబ్ధిదారులు ఉండగా ప్రస్తుతం ఆ సంఖ్య 2,26,995కు తగ్గిపోవడం గమనార్హం. జిల్లా వ్యాప్తంగా 25 వేలకు పైగా దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నట్టు అంచనా.

### నేతల ఇళ్లను ముట్టడిస్తాం



దివ్యాంగుల పింఛన్లు తొలగించేందుకు కూటమి ప్రభుత్వం చేస్తున్న కుట్రను ఉపేక్షించేది లేదు. దీనిపై త్వరలోనే రాష్ట్రవ్యాప్త ఉద్యమం చేపడతాం. కలెక్టరేట్లు, మంత్రులు, ఎమ్మెల్యేలు ఇళ్లను ముట్టడిస్తాం. దివ్యాంగుల పింఛన్లు రాష్ట్ర ప్రభుత్వానికి ఏమాత్రం భారం కాదు. 1980 నుంచి దివ్యాంగుల ధ్రువీకరణ పత్రాలను తిరిగి పరిశీలించిన దాఖలాలు లేవు. దివ్యాంగుల వయసు పెరుగుతున్న కొద్దీ వైకల్యం కూడా పెరుగుతూనే ఉంటుంది. ప్రభుత్వాలు ఇవి గుర్తించాలి.

– అల్లాడి నటరాజు, వికలాంగుల సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు, ఆకివీడు

**స్పౌజ్ పింఛన్లను కొత్తవి అంటూ ప్రచారం**

గతంలో పింఛన్ లబ్ధిదారుడు మృతిచెందితే మరుసటి నెల నుంచే అతని భార్య(స్పౌజ్)కు పింఛన్ మంజూరయ్యేది. కూటమి వచ్చాక పింఛన్ సైట్‌ను క్లోజ్ చేయడంతో ఈ తరహా పింఛన్ల మంజూరు ఆగిపోయింది.

నవంబరు తర్వాత మృతిచెందిన వారికి మాత్రమే ఇస్తూ వచ్చారు. దీంతో అంతకు ముందు భర్తను కోల్పోయిన వారు స్పౌజ్ పింఛన్ల కోసం ఎదురుచూపులు చూడాల్సి వచ్చింది. ఎట్టకేలకు జిల్లాలోని 3,988 మందికి ఆగస్టు నుంచి స్పౌజ్ పింఛన్లు పంపిణీ చేశారు. వీటినే కొత్త మంజూరు అన్నట్టుగా కూటమి నాయకులు హడావుడి చేయడం గమనార్హం. భర్తను కోల్పోయి తీవ్ర ఇబ్బందుల్లో ఉన్న నిరుపేద మహిళలు ఒక్కరికీ సాధారణ వితంతు పింఛన్ మంజూరు చేయలేదు.

## కొనసాగుతున్న భారీ వరద

- పోలవరం నుంచి 8 లక్షల క్యూసెక్కుల నీరు విడుదల
- నీట మునిగిన ఎద్దులవాగు, గుండేరు వాగు వంతెనలు

సాక్షి ప్రతినిధి, ఏలూరు: గోదావరికి వరద ప్రవాహం కొనసాగుతుంది. ఈ ఏడాది మూడోసారి వచ్చిన వరద మంగళవారం ఉగ్రరూపం దాల్చడంతో ముంపు గ్రామాల్లో వంతెనలు, లంక గ్రామాల్లో కాజ్‌వే నీటమునిగాయి. మంగళవారం సాయంత్రం 6 గంటలకు పోలవరం నుంచి 8లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. గోదావరి వరద మరో 48 గంటల్లో తగ్గుముఖం పట్టే అవకాశం ఉంది. ఎగువ ప్రాంతాల్లో వర్షాలు తగ్గడం, గోదావరి, శబరి ఉధృతి తగ్గి నిలకడ ప్రవహిస్తున్నాయి. మరోవైపు భద్రాచలం వద్ద మంగళవారం ఉదయం 38 అడుగుల మేర ఉన్న నీటి మట్టం సాయంత్రానికి మరో రెండు అడుగులు తగ్గింది. వేలేరుపాడు మండలంలోని ఎద్దులవాగు వంతెన నాలుగు రోజులుగా జలదిగ్బంధంలోనే ఉండటంతో 18 గ్రామాలకు మండల కేంద్రంతో రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. ఎద్దులవాగు వద్ద నాటుపడవ ఏర్పాటు చేశారు. కుక్కునూరు మండలంలోని గుండేరు వాగు నీట మునిగింది. దీంతో ఈ మార్గంలోనూ రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. బుధవారం సాయంత్రానికి వరద కొంత మేర తగ్గుముఖం పట్టే అవకాశముంది.

## రక్షణ గోడ నిర్మాణం వేగవంతం చేయాలి

భీమవరం (ప్రకాశంచౌక్): పీఎం లంకలో సముద్రపు కోత నుంచి రక్షణకు గోడ నిర్మాణ పనులను వేగంగా పూర్తి చేయాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి రక్షణ గోడ ప్రాజెక్ట్ పురోగతిపై జూమ్ ద్వారా సమీక్షించారు.

## న్యూస్‌రీల్

### డీఆర్‌ఓ వెంకటేశ్వర్లుకు కన్ఫర్డ్ ఐఏఎస్‌గా పదోన్నతి



మొగిలి వెంకటేశ్వర్లుకు అభినందనలు తెలుపుతున్న కలెక్టర్ నాగరాణి, జేసీ

భీమవరం(ప్రకాశం చౌక్): డీఆర్‌ఓ మొగిలి వెంకటేశ్వర్లను కన్ఫర్డ్ ఐఏఎస్‌గా ప్రకటిస్తూ కేంద్ర ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసిన సందర్భంగా మంగళవారం జిల్లా కలెక్టరేట్‌లో కలెక్టర్ నాగరాణి, జేసీ టి.రాహుల్ కుమార్ రెడ్డి సత్కరించారు. వెంకటేశ్వర్లు గతంలో డిప్యూటీ కలెక్టర్, ఆర్డీవోగా పనిచేశారు. 2024 అక్టోబర్ నుంచి పశ్చిమగోదావరి జిల్లా రెవెన్యూ అధికారిగా పనిచేస్తున్నారు. ఆగస్టు 18న కేంద్రం కన్ఫర్డ్ ఐఏఎస్‌గా ఎంపిక చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా జిల్లా అధికారులు, రెవెన్యూ అసోసియేషన్ సిబ్బంది ఆయనకు అభినందనలు తెలిపారు.

### ఓపెన్ స్కూల్ ప్రవేశాల గడువు పెంపు

భీమవరం: ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం (ఓపెన్ స్కూల్) ద్వారా 2025–26 విద్యా సంవత్సరంలో 10వ తరగతి, ఇంటర్ చదవాలనుకునే అభ్యర్థులకు మరో అవకాశం వచ్చిందని జిల్లా విద్యాశాఖాధికారి ఇ.నారాయణ తెలిపారు. ప్రవేశాలకు వచ్చే నెల 16లోపు అపరాధ రుసుం రూ.200 చెల్లించి దరఖాస్తులు పొందాలని అన్నారు. ఓపెన్ స్కూల్ అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

### వరదముంపులో కనకాయలంక కాజ్‌వే



కనకాయలంక వద్ద వరద నీటిలో మునిగిన కాజ్ వే మీదుగా ప్రయాణిస్తున్న గ్రామస్తులు

యలమంచిలి: గోదావరిలో వరద ఉధృతి పెరగడంతో కనకాయలంక కాజ్‌వే మంగళవారం నీట మునిగింది. దీంతో కనకాయలంక ప్రజలు అడుగున్నర లోతు వరదనీటిలో రాకపోకలు సాగిస్తున్నారు. వరదనీరు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు, స్కూల్ విద్యార్థుల రాకపోకలకు అంతరాయం కలగకుండా పడవలు ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ గ్రంధి నాగ వెంకట పవన్‌కుమార్ తెలిపారు. ప్రజలు అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే బయటకు రావాలని, వరద తగ్గే వరకు ఇళ్లకే పరిమితం కావాలని ఆయన కోరారు. భద్రాచలం వద్ద వరద తగ్గుముఖం పడుతున్న నేపథ్యంలో బుధవారం కాజ్‌వేపై వరదనీటి ప్రవాహం కొనసాగే అవకాశం ఉన్నా, సాయంత్రానికి తగ్గే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు.

### రీసర్వే గడువులోగా పూర్తి చేయాలి

భీమవరం (ప్రకాశంచౌక్): ఫేజ్–1, ఫేజ్–2 రీసర్వే నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని జాయింట్ కలెక్టర్ చాంబర్ నుంచి మంగళవారం రీసర్వే, గ్రామాల సరిహద్దుల నిర్ధారణ, జాయింట్ ఎల్‌పిఎంల ప్రగతిపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫేజ్ వన్–1 లో పూర్తి కావాల్సిన ఐదు గ్రామాలలో రీ సర్వే పనులను వచ్చే శనివారంలోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఫేజ్–2లో జరుగుతున్న 27 గ్రామాలకు సంబంధించి ప్రతి రైతుకు 9(2) నోటీసు అందించాలన్నారు. రీసర్వే చేయాల్సిన 72 గ్రామాల గ్రామ సరిహద్దులను రెండు రోజుల్లోగా నిర్ధారించాలన్నారు. భూమి సరిహద్దు సమస్య దరఖాస్తులు, ఆన్‌లైన్ సబ్ డివిజన్ దరఖాస్తులు, పీజీఆర్‌ఎస్‌లో అందిన దరఖాస్తుదారుల సమస్యలను సకాలంలో పరిష్కరించాలన్నారు. వచ్చే వారంలోగా సమస్యల పరిష్కారంపై ప్రగతి చూపించని వారిపై చర్యలు తీసుకుంటామని జాయింట్ కలెక్టర్ హెచ్చరించారు.

### కొల్లేటికోట పీహెచ్‌సీ తనిఖీ

సాక్షి స్పందన

కైకలూరు: కొల్లేటికోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఏలూరు జిల్లా వైద్యాధికారి జాన్ అమృతం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ నెల 12న కొల్లేటికోట పీహెచ్‌సీ సమస్యలపై 'లంకంత ఆస్పత్రి.. డాక్టర్లు లేరు' శీర్షికతో కథనం వెలవడింది. దీనిపై డీఎంహెచ్‌వో పరిశీలన చేశారు. ఆస్పత్రిలో శుభ్రత పాటించాలని సూచించారు. ల్యాబ్ టెక్నీషియన్ పోస్టును త్వరగా భర్తీ చేస్తా మన్నారు. డాక్టర్ల నియామకం చేపడతామన్నారు.

# జీతాలు మహాప్రభో..!

**ట్రిపుల్ ఐటీ కాంట్రాక్టు సిబ్బందికి నేటికీ అందని వైనం**

నూజివీడు: అధికారంలోకి వస్తే ప్రతినెల ఒకటో తేదీనే జీతాలు ఇస్తాం.. ఇదీ ఎన్నికల సమయంలో టీడీపీ అధినేత చంద్రబాబు చెప్పిన మాటలు. పరిస్థితి అందుకు విరుద్ధంగా ఉంది. ఈ నెలలో 19వ తేదీ గడిచినా జీతాలు రాక రాష్ట్రంలోని నాలుగు ట్రిపుల్ ఐటీల్లోని కాంట్రాక్టు ఉద్యోగులు ఇబ్బంది పడుతున్నారు. ఇచ్చే అరకొర వేతనాలను ఇన్ని రోజులు ఇవ్వకుండా ఉంటే జీవనం ఎలాగని ఉద్యోగులు ప్రశ్నిస్తున్నారు. రాష్ట్రంలోని రాజీవ్‌గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం పరిధిలోని నూజివీడు, ఇడుపులపాయ, ఒంగోలు, శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు బోధనా సిబ్బందికి ఇంతవరకు వేతనాలు లేవు. గతంలో వేతనాలు ఆలస్యమైతే సిబ్బందికి వారి జీతంలో 50 శాతం సొమ్మును అడ్వాన్సుగా చెల్లించేవారు. అలా తీసుకున్న సొమ్మును జీతాలు ఇచ్చేటప్పుడు మినహాయించేవారు. ఇప్పుడు అడ్వాన్సులు కూడా ఇవ్వకపోవడంతో కుటుంబ ఖర్చులకు అప్పులు చేయాల్సిన పరిస్థితి నెలకొంది.

**ఈఎంఐలు చెల్లించేందుకు అప్పులు**

కాంట్రాక్టు అధ్యాపకులందరూ ఆర్థిక వెసులుబాటును బట్టి గృహావసరాల కోసం రుణాలు తీసుకున్నారు. బ్యాంకుల్లో చేసిన అప్పులకు, క్రెడిట్ కార్డులపై తీసుకున్న వాటికి బ్యాంకు ఖాతాలో తప్పనిసరిగా డబ్బులు సిద్ధంగా ఉంచాలి. దీంతో అప్పులు చేసి ఖాతాలో ఉంచుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఈఎంఐలకు సరిపడా నగదు లేకపోతే సిబిల్ స్కోర్ తగ్గిపోతుందని ఉద్యోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వీటికి తోడు కుటుంబం గడవడానికి, పిల్లల ఫీజులు చెల్లించడానికి అనేక అవసరాలకు డబ్బులు అవసరం కాగా అప్పు చేయాల్సి వస్తోంది.

**700 మంది కాంట్రాక్టు సిబ్బంది :** నాలుగు ట్రిపుల్ ఐటీల్లో కాంట్రాక్టు పద్ధతిలో మెంటార్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, గెస్ట్ ఫ్యాకల్టీలు, ల్యాబ్ అసిస్టెంట్‌లు, ల్యాబ్ టెక్నీషియన్లు, ఐటీ మెంటార్లు పనిచేస్తున్నారు. వీరందరూ కలిపి 700కు పైగానే ఉంటారు. అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు యూనివర్శిటీనే నెల ప్రారంభంలోనే వేతనాలను చెల్లించింది. నాలుగు ట్రిపుల్ ఐటీల్లోని కాంట్రాక్టు సిబ్బందికి నెలకు రూ.3 కోట్లు జీతాల కింద చెల్లించాలి. ఇంతవరకు వారికి వేతనాలు చెల్లించలేదు.

# కూల్చివేతను అడ్డుకున్న దళితులు



వాండ్రంలో ఇళ్లు పడగొట్టేందుకు సిద్ధంగా ఉంచిన పొక్లెయిన్

ఉండి: ఉండి మండలం వాండ్రం దళితపేట డ్రెయిన్‌ను ఆనుకుని వున్న 30 ఇళ్లను కూల్చేందుకు పొక్లెయిన్‌ను తీసుకు రాగా దళితులు అడ్డుకున్నారు. గతంలో అక్కడ అధికారులు కొలతలు వేసి.. డ్రెయిన్ కొలతలు మీ ఇళ్లల్లోకి వచ్చేశాయి ఇళ్ళు పడగొట్టాలని మార్కింగ్ చేసి వెళ్లారు. గత కొన్ని రోజులుగా ఈ విషయంపై గొడవ నడుస్తోంది. కొందరు దళితులు సోమవారం కలెక్టర్‌కు గ్రీవెన్స్ సెల్‌లో వినతిపత్రం అందజేశారు. వినతిపత్రం అందించి వచ్చిన కొద్దిసేపటికే కొందరు పొక్లెయిన్‌తో దళితపేటకు చేరుకున్నారు. దీంతో దళితులు అధికారులకు ఫోన్‌లు చేశారు. మాకెలాంటి సంబంధం లేదు, మేం పొక్లెయిన్ పంపించలేదని అధికారులు సమాధానమిచ్చారు. దీంతో దళితులు ఆందోళనకు సిద్ధపడ్డారు. ఈ పరిణామాలను గమనించిన అధికారులు వెంటనే ఆ ప్రాంతం నుంచి పొక్లెయిన్‌ను పంపించి వేయడంతో సమస్య తాత్కాలికంగా సద్దుమణిగింది. ఇళ్ల పడగొట్టి రోడ్డు వేస్తాం అని ఎవరైనా వస్తే దానికి తగిన విధంగా సమాధానమిస్తామంటూ దళితులు నిరసన కార్యక్రమాలు చేపట్టేందుకు సిద్ధమవుతున్నారు. ప్రభుత్వ లెక్కల్లో వాండ్రం దళితపేటకు ఆనుకుని మురుగుబోదె లేనే లేదని అంటున్నారు. ఇప్పుడు బోదెకు కొలతలు, దళితుల ఇళ్ళపై మార్కింగ్‌లు ఎక్కడ నుంచి వచ్చాయని కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. గ్రామంలోని మంచినీటి చెరువుకు సంబంధించిన మురుగు బయటకు పోయేలా సమీపంలోని కొందరు రైతుల విన్నపంతో చిన్న బోదెను ఏర్పాటు చేశారని తెలిపారు. కాలక్రమేణా అది పెద్దబోదెగా మారిందన్నారు. రైతుల కోసం తాము బోదె తవ్వకానికి ముందడుగు వేశామని, ఇప్పుడు ఇళ్లు పడగొడతామంటే చూస్తూ ఊరుకునేది లేదంటున్నారు. అధికారులు న్యాయం చేయకపోతే తామంతా పోరుబాట పడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కోనాల రాజేంద్రకుమార్, కోనాల జీవన్‌కుమార్, ఆలిండియా క్రిస్టియన్ కౌన్సిల్ వర్కింగ్ ప్రెసిడెంట్ మత్తి రాజ్‌కుమార్, దీన రాజు, పాము మధు, తదితరులు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసినవారిలో ఉన్నారు.

# కొల్లేరు ప్రక్షాళన ప్రశ్నార్థకం

- కలగా మారిన డ్రెయిన్ల మరమ్మతులు
- ఎగువ నుంచి భారీగా వర్షపు నీరు
- రెగ్యులేటర్ల నిర్మాణంతోనే సమస్యకు చెక్



ఉప్పుటేరుపై నిర్మించిన రైల్వే బ్రిడ్జి వద్ద నీటికి అడ్డంగా మారిన గుర్రపు డెక్క (ఫైల్)



వరదల కారణంగా ఇనుప వంతెన మునక(ఫైల్)

కైకలూరు: కొల్లేరు డ్రెయిన్లకు మరమ్మతులు నిర్వహించకపోవడంతో ఎగువ నుంచి వస్తున్న వరద నీటితో కొల్లేరు లోతట్టు గ్రామాలు జలమయమవుతున్నాయి. వరద నీరు బుడమేరు, తమ్మిలేరు, రామిలేరు, గుండేరు వంటి భారీ డ్రెయిన్లతో పాటు మరో 31 మీడియం, మైనర్ డ్రెయిన్లు, కాలువలు చానల్స్ ద్వారా పెద్ద ఎత్తున కొల్లేరుకు చేరుతుంది. వరదల సమయంలో 1,10,920 క్యూసెక్కులు కొల్లేరుకు వస్తుందని అంచనా. వీటిలో కేవలం 12 వేల క్యూసెక్కుల నీరు మాత్రమే ఉప్పుటేరు ద్వారా 62 కిలోమీటర్లు ప్రయాణించి బంగాళాఖాతం చేరుతుంది.

ఏలూరు జిల్లాలోని కైకలూరు, మండవల్లి, పెదపాడు, ఏలూరు, దెందులూరు, భీమడోలు, ఉంగుటూరు, నిడమర్రు మండలాలతో పాటు పశ్చిమగోదావరి జిల్లా ఆకివీడు మండలంలో విస్తరించిన కొల్లేరులో 71 గ్రామాలు, కొల్లేరు అనుబంధ గ్రామాలు 150 కలిపి మొత్తం 227 గ్రామాలు ఉన్నాయి. కొల్లేరుకు చేరే నీటిని దిగువకు పంపించే మండవల్లి మండలం పెదఎడ్లగాడి వంతెన ఖానాల వద్ద గుర్రపుడెక్క భారీగా పేరుకుపోయింది. దీంతో నీటి ప్రవాహం మందగించి సమీప పెనుమాకలంక గ్రామానికి చేరే రోడ్డుపై నుంచి నీరు పారుతోంది. దీంతో రాకపోకాలు బంద్ చేశారు. ప్రజలు పడవలపై గ్రామాలకు చేరుతున్నారు.

**కమిటీలు సూచించినా కదలిక :** వరదల సమయంలో కొల్లేరుకు వచ్చే నీటితో లాభాల కంటే నష్టాలు ఎక్కువగా జరుగుతున్నాయని 1895లో అప్పటి ఇరిగేషన్ అధికారులు గుర్తించారు. తమ్మిలేరు, బుడమేరుల వల్ల జరుగుతున్న పంట నష్టాల నివారణకు తీసుకోవాల్సిన చర్యని ప్రతిపాదించారు. 1964 వరదల తర్వాత మిత్ర కమిటీ కూడా ఇవే ప్రతిపాదనలు చేసింది. వరదల సమయంలో ఎగువ ప్రాంతాల నుంచి కొల్లేరుకు వచ్చే నీరు 47 టీఎంసీలకు పైనే ఉంటుందని, రిజర్వాయర్ల నిర్మాణం జరిగితే డెల్టాలో మరో 5 లక్షల ఎకరాల సాగులోనికి తీసుకురావడానికి ఈ నీరు పనికొస్తుందని సూచించారు.

**అటకెక్కిన కొల్లేరు చానలైజేషన్**

తొలిదశలో కొల్లేరులో నీటిమట్టం 7 అడుగులు ఉంటే 15 వేల క్యూసెక్కుల నీరు అవుట్‌ఫ్లో ఉండేలా ఉప్పుటేరుని ఆధునికరించాలని కమిటీ సూచించింది. రెండో దశలో కొల్లేటి నీటిమట్టం 7 అడుగులు ఉంటే 20 వేల క్యూసెక్కుల నీరు అవుట్ ఫ్లో ఉండేలా పనులు చేపట్టాలని పేర్కొంది. రెండు దశల పనులకు దాదాపు రూ.7 కోట్లు ఖర్చు అవుతోందని అంచనా వేశారు. నిధులు కొరత, కొల్లేరు చుట్టూ ఆక్రమణలు ఇలా రకరకాల కారణాలతో 1981 వరకు పనులు ప్రారంభం కాలేదు. తర్వాత ప్రభుత్వం ప్రకటించిన రూ.40 కోట్లు ఏమాత్రం సరిపోవని తేల్చారు. కొన్ని సంవత్సరాల క్రితం డ్రెడ్జింగ్ పనులు తూతూ మంత్రంగా జరిగాయి.

### ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయాలి



కొల్లేరులో నీటి ప్రవాహానికి అడ్డంకులు తొలగించడానికి పంట కాల్వల్లో కలాసి వ్యవస్థ మాదిరిగా ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయాలి. ఎగువ నుంచి కొట్టుకొస్తున్న గుర్రపుడెక్క గుదిబండగా మారుతోంది. కొల్లేరు, ఉప్పుటేరులో పూడికలు తీయాలి. ఉప్పుటేరు నుంచి సముద్రానికి నీరు పోయేలా అడ్డంకులను తొలగించాలి.

– సైదు సత్యనారాయణ, కొల్లేరు ప్రాంతీయ వ్యవసాయ, మత్స్య సంఘాల అభివృద్ధి సంఘం అధ్యక్షుడు

### ఆక్రమణలు తొలగిస్తున్నాం



ఉప్పుటేరు వద్ద ఆక్రమణలను యుద్ధప్రాతిపాదికన తొలగిస్తున్నాం. ప్రధానంగా ఉప్పుటేరుపై నిర్మించిన రైల్వే బ్రిడ్జి వద్ద గుర్రపుడెక్క, కిక్కిసను 6 పొక్లయిన్‌లతో తీస్తున్నారు. ప్రతి ఏటా మాదిరిగా కాకుండా ముందస్తు చర్యల్లో ఆక్రమణల తొలగింపు పనులు జరుగుతున్నాయి.

– ఎం.రామకృష్ణ, డ్రెయినేజీ డీఈ, కైకలూరు

### కొల్లేరు సరస్సులో చేయాల్సినవి

- కొల్లేరుకు తూర్పున పందికోడు, తోకలపల్లి, కాపవరం కాలువలను, పశ్చిమ వైపు రామిలేరు, పోల్‌రాజు, చంద్రయ్య, పెదకొమ్ములేరు, చైనా కొమ్మలేరు కాలువలను ఉప్పుటేరులో కలపాలి.
- వరదలు నివారించేలా ఇరువైపులా డ్రెయిన్లు నిర్మించాలి.
- కొల్లేరు నుంచి ఎలాంటి అడ్డంకులు లేకుండా సముద్రానికి వెళ్లేలా ఉప్పుటేరు చానలైజేషన్ పథకాన్ని పునఃప్రారంభించాలి.
- సరస్సు లోపల నీటి ప్రవాహ మార్గాలను అడ్డుకునే నిర్మాణాలు, చెరువులు, అక్రమ రోడ్లను తొలగించాలి.
- కొల్లేరు పూడిపోకుండా ఎప్పటికప్పుడు డిసిల్టింగ్ కార్యకలాపాలు తప్పనిసరిగా నిర్వహించాలి. కాలువలకు అవుట్‌ఫాల్ స్లూయిజ్‌లు ఏర్పాటు చేయాలి.
- ఉప్పుటేరు వద్ద కొత్తగా నిర్మించిన రైల్వే బ్రిడ్జి పిల్లర్ల విస్తీర్ణాన్ని తగ్గించాలి.
- ఉప్పుటేరు వద్ద ఆక్రమణలను పూర్తి స్థాయిలో తొలగించాలి.

### రెగ్యులేటర్ల నిర్మాణమే పరిష్కారం

కొల్లేరులో ఎల్లప్పుడూ నీరు నిల్వ ఉండాలంటే రెగ్యులేటర్ నిర్మాణమే శరణ్యమని కొల్లేరుపై అధ్యయనం చేసిన మిత్ర, శివరామకృష్ణయ్య కమిటీలు చెప్పాయి. ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో భాగంగా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉండగా కొట్టాడ, దుంపగడప మధ్య ఒకటి, పడతడక మూలపర్రు వద్ద మరో రెండు రెగ్యులేటర్ నిర్మాణానికి రూ.452 కోట్ల అంచనాలతో ప్రతిపాదనలను ఆమోదించారు. రెగ్యులేటర్ నిర్మాణం జరిగితే నీటి నిల్వతో పాటు సమీప సముద్రం నుంచి ఏటా ఎగదన్నే ఉప్పునీటికి అడ్డకట్టు వేయవచ్చు. కూటమి ప్రభుత్వం రెగ్యులేటర్ల ఊసే ఎత్తడం లేదు.

## క్లుప్తంగా

### డ్రాప్ చేస్తామని నమ్మించి చోరీలు

ముఠాను అరెస్ట్ చేసిన పోలీసులు



వివరాలు వెల్లడిస్తున్న సీఐ ఆదిప్రసాద్

**తాడేపల్లిగూడెం అర్బన్:** బస్టాపులలో ఒంటరిగా ఉన్న వ్యక్తులను డ్రాప్ చేస్తామని నమ్మించి నిర్మానుష్య ప్రదేశానికి తీసుకువెళ్లి దోపిడీ చేస్తున్న ముఠాను పోలీసులు పట్టుకున్నారు. నిందితులు పెంటపాడుకు చెందిన కోట జగదీష్ అలియాస్ రూతమ్మ, తణుకు మండలం ముద్దాపురానికి చెందిన యల్లా సంతోష్, గణపవరం మండలం మొయ్యేరుకు చెందిన ఆండ్రు హర్షకుమార్‌గా గుర్తించారు. ఈమేరకు సీఐ బాదం ఆదిప్రసాద్ మంగళవారం వివరాలను వెల్లడించారు. గత మే నెలలో బంధకవి మేధా వెంకట సుబ్రహ్మణ్యం తాడేపల్లిగూడెంలోని ఏలూరు రోడ్డులో బస్‌స్టాప్‌లో బస్సు కోసం వేచి ఉన్నారు. సుబ్రహ్మణ్యం వద్దకు నిందితులు వచ్చి డ్రాప్ చేస్తామని చెప్పి కారు ఎక్కించుకున్నారు. కొంతదూరం వెళ్లిన తరువాత కారును ఆపి సుబ్రహ్మణ్యంపై దాడి చేసి అతని వద్ద నుంచి రూ.3,500 నగదు, అతని మెడలోని బంగారు గొలుసు, రెండు ఉంగరాలు అపహరించారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఐ ఆదిప్రసాద్ ఎస్సైలు పి.నాగరాజు, బాదం శ్రీను సిబ్బందితో బృందాలుగా ఏర్పడి విచారణ చేపట్టారు. పెదతాడేపల్లిలోని ఓ కళాశాల వద్ద ఉన్న నిందితులను అదుపులోకి తీసుకుని, వారి నుంచి రూ. 3.15 లక్షలు విలువైన బంగారు ఆభరణాలు, కారు, ఒక చాకును స్వాధీనం చేసుకున్నట్లు సీఐ ఆది ప్రసాద్ తెలిపారు.

### ఉద్యోగం పేరిట బురిడీ

**భీమవరం:** ప్రభుత్వాసుపత్రిలో ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి నగదు తీసుకుని మోసగించిన ఘటన ఇది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భీమవరం రెండో పట్టణానికి చెందిన యు.రాణి అనే మహిళకు ప్రసాద్‌రాజు అనే వ్యక్తి పరిచయమయ్యాడు. ప్రభుత్వ ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి రెండు విడతల్లో రూ.9.80 లక్షలు తీసుకున్నాడు. ఇల్లు కూడా కట్టిస్తానని అందుకు సంబంధించిన దస్తావేజులను సైతం తీసుకున్నాడు. ఉద్యోగం ఇప్పించకుండా, ఇంటి నిర్మాణం చేయకుండా మోసగించినట్లు గుర్తించిన బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్సై రెహమాన్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

### విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి

**టి.నరసాపురం:** పామాయిల్ గెలలు కోస్తుండగా ఓ వ్యక్తి విద్యుత్ షాక్ తగిలి మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం బొర్రంపాలెం గ్రామానికి చెందిన దోమతోటి అంజిబాబు (30) మంగళవారం అదే గ్రామానికి చెందిన రైతు పామాయిల్ తోటలో పామాయిల్ గెలలు కోయడానికి వెళ్లాడు. గెలలు కోస్తుండగా, గెలలు కోసే ఇనుప గెడ కత్తి విద్యుత్ తీగలపై పడి విద్యుత్ షాక్ తగిలి అక్కడికక్కడే మృతిచెందాడు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

## శ్రీవారి భక్తులకు రహదారి కష్టాలు



కుంకుళ్లమ్మ ఆలయ సమీపంలో రోడ్డు దుస్థితి



విర్డ్ ఆస్పత్రి వద్ద ఇలా..



నిమ్మకాయల మార్కెట్ యార్డు వద్ద..

ద్వారకాతిరుమల చినవెంకన్న దర్శనానికి వెళ్లే భక్తులు అప్రమత్తంగా లేకుంటే ప్రమాదాల బారిన పడటం ఖాయం. భీమడోలు–ద్వారకాతిరుమల క్షేత్ర ప్రధాన రహదారి గుంతలు పడి అధ్వానంగా మారింది. నిత్యం ఇటుగా వేలాది వాహనాల రాకపోకలు సాగుతున్నాయి. ముఖ్యంగా ద్వారకాతిరుమలలోని కుంకుళ్లమ్మ ఆలయ సమీపం, నిమ్మకాయల మార్కెట్ యార్డు వద్ద, లక్ష్మీపురంలోని విర్డ్ ఆస్పత్రి వద్ద, గొల్లగూడెం, సూర్యచంద్రరావుపేట చెరువు వద్ద, పంగిడిగూడెంలో రహదారి ఛిద్రమైంది. రోజురోజుకూ దెబ్బతింటున్న రోడ్డు ప్రమాదాలకు నిలయంగా మారింది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో భారీ గోతులు నీటితో నిండిపోయాయి. గొల్లగూడెం వద్ద రోడ్డు మధ్యలో గుంతల వద్ద స్థానికులు హెచ్చరికగా జెండా ఏర్పాటుచేశారు. ఇటుగా రాష్ట్ర, జిల్లా స్థాయి అధికారులు, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు ప్రయాణిస్తున్నా పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి.

– ద్వారకాతిరుమల

# దోమ కాటు ప్రాణాంతకమే

- గ్రామాల్లో అపరిశుభ్రతతో దోమల విజృంభణ
- వ్యాధుల బారిన పడుతున్న ప్రజలు
- వైద్యశిబిరాలు సైతం నిర్వహించని కూటమి ప్రభుత్వం



మలేరియా వ్యాధి కారణమైన ఆడ ఎనాఫిలిస్ దోమ



ఆసుపత్రుల్లో జ్వర పీడితులు



రాష్ట్రీయ రహదారి పాలసానిపల్లి రోడ్డుపై నిలిచిన నీరు

**భీమడోలు:** దోమకాటు అత్యంత ప్రమాదకరం.. హత్యలు, దాడులతో మరణిస్తున్న వారి కంటే దోమలతో వచ్చే వ్యాధులతో మృతి చెందే వారి సంఖ్య ఎక్కువ అని అధ్యయనాలు చెబుతుండడం ఆందోళన కలిగించే విషయం. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు పల్లెల్లో దోమలు విజృంభిస్తున్నాయి. దీంతో అనేకమంది వ్యాధుల బారిన పడుతున్నారు. వాటి పట్ల సకాలంలో స్పందించి చికిత్స చేయించుకోకుంటే పెను ప్రమాదమే అని వైద్యులు చెబుతున్నారు. పారిశుద్ధ్య నిర్వహణలో సరైన చర్యలు చేపట్టకపోవడంతో దోమలు వ్యాప్తి చెందుతున్నాయి. దీనికితోడు కూటమి ప్రభుత్వం ఫ్రైడే డ్రై కార్యక్రమం, ఇంటింటికీ ఆరోగ్య సర్వేలు, వైద్య శిబిరాలపై దృష్టి సారించకపోవడంతో దోమల కాటు రోగుల సంఖ్య గ్రామాల్లో గణనీయంగా పెరుగుతోంది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో వర్షాకాలం వచ్చిందంటే వైద్య ఆరోగ్య సిబ్బంది, సచివాలయ, వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి ప్రతి ఒక్కరి ఆరోగ్య పరిస్థితిపై సర్వే చేసి ఎప్పటికప్పుడు తగు చర్యలు చేపట్టే వారు. కూటమి ప్రభుత్వం ప్రజాఆరోగ్యంపై శ్రద్ధ వహించకపోవడంతో దోమలు విజృంభిస్తున్నాయి. ఆగస్టు 20వ తేదీన ప్రపంచ దోమల దినోత్సవం సందర్భంగా దోమల వలన వచ్చే వ్యాధులు, వాటి లక్షణాలు, నివారణ చర్యలు గురించి తెలుసుకుందాం.

**దోమకాటుతో వచ్చే వ్యాధులు, లక్షణాలు**

**మలేరియా:** ఆడ అనాఫిలస్ దోమ కుట్టడం వల్ల మలేరియా వ్యాధి సోకుతుంది. దీని వలన చలి, వణుకుతో జ్వరం రావడం, శరీర ఉష్ణోగ్రతలు పెరగడం, జ్వరం తరచుగా వస్తూ ఉంటుంది.

**డెంగీ:** పగటి సమయంలో కుట్టే ఏడీస్ ఆడ దోమల ద్వారా డెంగీ వ్యాధి సోకుతుంది. హఠాత్తుగా తీవ్ర జ్వరం రావడం, కదలలేని స్థితి, ఎముకలు, కండరాల్లో భరించలేని నొప్పి, శరీరంపై ఎర్రని దద్దుర్లు, వాంతులు, వికారం, నోరు ఎండిపోవడంతో పాటు చిగుళ్లు, ముక్కు నుంచి రక్తం వస్తుంది. ప్లేట్లెట్స్ అమాంతంగా తగ్గిపోతాయి.

**మెదడు వాపు:** క్యూలెక్స్ ఆడదోమ కుట్టడం వల్ల ఈ వ్యాధి సంక్రమిస్తుంది. జపనీస్ ఎన్సెఫలైటిస్ వైరస్ ద్వారా వ్యాపిస్తుంది. ఎక్కువగా 2 నుంచి 14 ఏళ్ల లోపు పిల్లల్లో ఈ వ్యాధి వస్తుంది. ఆకస్మిక జ్వరం రావడం, విపరీతమైన తలనొప్పి, వాంతులు రావడం, అపస్మారక స్థితిలోకి వెళ్లడం, శరీరంలో ఏదో ఒకపక్క పక్షవాతానికి గురి కావడం, ఫిట్స్ రావడం జరుగుతుంది.

**చికెన్ గున్యా:** ఏడీస్ ఈజిప్టీ దోమలతో ఈ వ్యాధి వ్యాప్తి చెందుతుంది. తలనొప్పి, వాంతులు, వికారంతో పాటు హఠాత్తుగా జ్వరం, కీళ్ల నొప్పులు, సరిగా నిలబడ లేకపోవడం జరుగుతుంది. చేతులు, కాళ్లు, కీళ్లలో వాపు వచ్చి కనీసం అడుగు తీసి వేయలేని పరిస్థితి ఏర్పడుతుంది.

**ఫైలేరియా:** బోధకాలు అని కూడా అంటారు. క్యూలెక్స్ దోమ ద్వారా ఈ వ్యాధి వ్యాప్తి చెందుతుంది. శరీరంలోని ఏ భాగానికైనా బోధకాలు సోకుతుంది. తరచూ జ్వరం, చంకల్లో, గజ్జల్లో బిళ్ల కట్టడం, వెన్నుపాము దగ్గర నుంచి అన్ని అవయవాలపై ప్రభావం చూపుతుంది.

**దోమల నివారణ చర్యలు**

**నిమ్మనూనె:** దోమల నివారణకు యాకలిప్టస్, లెమన్ ఆయిల్‌ను చర్మంపై రాసుకోవాలి. దీని వల్ల మన చర్మానికి ఎలాంటి హాని ఉండదు. వీటిలో ఉండే సినోల్‌రసాయనం యాంటీసెప్టిక్ కీటక నివారిణిగా పని చేస్తుంది.

**కర్పూరం:** చీకటి పడుతున్న వేళలో ఇంటి తలుపులు మూసేసి కర్పూరం వెలిగించండి, 20 నిమిషాల తర్వాత తలుపు తెరిస్తే దోమలు కనిపించవు.

**పరిశుభ్రత తప్పనిసరి**

నీరు నిల్వ ఉండే ప్రాంతాలు, చెత్తా చెదారం, ఫ్రిడ్జ్ కింద ఉండే నీటి ఫ్యాన్లలో నిల్వ ఉండే నీటిలో కూడా దోమలు పెరుగుతాయి. ఈ నీటిని ఎప్పటికప్పుడు పారబోయాలి. పూలకుండీల్లో నిల్వ ఉండే నీరు దోమల పెరిగేందుకు అనుకూలమే. ఆ నీరు ఎప్పటికప్పుడు బయటకు పోయేలా జాగ్రత్తలు తీసుకోవాలి. సెప్టిక్ ట్యాంకుల నుంచి దుర్వాసన పోయే గొట్టాలకు తీగ మెస్ జల్లెడలు బిగించాలి, సెప్టిక్ ట్యాంకుల్లో కొంచెం కిరోసిన్ పోయాలి. పాత టైర్లు, తాగి పారేసిన కొబ్బరి బొండాలు, వాడి విసిరేసిన ప్లాస్టిక్ టీ కప్పులను దూరంగా ఉంచాలి. లేదా తగలబెట్టాలి. ఖాళీ స్థలాల్లో పెరిగిన తుప్పలు, నిలిచిన మురుగునీటితో దోమలు ఇబ్బడిముబ్బడిగా పెరుగుతున్నాయి. వాటిని పూడ్చేయాలి. నీరు నిల్వ ఉండే ప్రాంతాల్లో క్రమం తప్పకుండా కీటక నియంత్రణ చర్యలు, ఫాగింగ్ చేయాలి.

### దోమల నియంత్రణ సాధ్యమే



ప్రతి ఒక్కరూ పరిసరాల శుభ్రతపై దృష్టి సారించాలి. ప్రతి గృహం వద్ద వారానికొకసారి పొడి శుక్రవారం పాటిస్తే దోమల నియంత్రం సాధ్యమవుతుంది. పంచాయతీ వారి సహకారంతో దోమలు ఎక్కువగా ఉండే ప్రాంతాలను గుర్తించి అక్కడ కీటక నియంత్రణ చర్యలు చేపడుతున్నాం. దోమ రహిత సమాజ స్థాపనలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలి.

– వైవీ లక్ష్మణరావు, ఎంపీహెచ్ఈవో, పూళ్ల

### ప్రజలను చైతన్యం చేస్తున్నాం



వర్షాకాలంలో ఎక్కువగా దోమలు కుట్టడం ద్వారా జ్వరాల బారిన పడుతుంటారు. వ్యాధుల నియంత్రణకు మా వంతు కృషి చేస్తున్నాం. గ్రామాల్లో అవగాహన ర్యాలీలు, కరపత్రాలను అందించి ప్రజలను జాగృతం చేస్తున్నాం. నీటి నిల్వలు తొలగించాలని, దోమ తెరలు వాడాలని, దోమల మందును పిచికారి చేయాలని అవగాహన కల్పిస్తున్నాం.

– జే.గోవిందరావు, మలేరియా సబ్ యూనిట్ సహాయ అధికారి, ఏలూరు

### కారు ఢీకొని వ్యక్తి మృతి

**ఉండి:** కారు, మోటార్‌సైకిల్ ఢీకొన్న ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందగా ఐదుగురు గాయపడ్డారు. వివరాల ప్రకారం ఆకివీడు తాళ్ళకోడు ప్రాంతానికి చెందిన అంగర శ్రీను అతని కుమార్తెతో కలసి ద్విచక్రవాహనంపై భీమవరం వెళ్లి తిరిగి వస్తుండగా కలిసిపూడి గ్రామంలో ఎదురుగా వచ్చిన కారు వీరిని ఢీకొంది. ఈ ప్రమాదంలో శ్రీను అక్కడికక్కడే మృతి చెందగా అతని కుమార్తెతోపాటు, కారులోని నలుగురు వ్యక్తులకు స్వల్ప గాయాలయ్యాయి. ఈ ఘటనపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

### ఐజేయూ సెక్రటరీ జనరల్‌గా సోమసుందర్



దూసనపూడి సోమసుందర్

**తాడేపల్లిగూడెం :** ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ (ఐజేయూ)సెక్రటరీ జనరల్‌గా రాష్ట్రానికి చెందిన దూసనపూడి సోమసుందర్ ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. అధ్యక్షునిగా పంజాబ్, చండీగఢ్ జర్నలిస్టుల యూనియన్ నుంచి బల్వీందర్ సింగ్ జమ్మూ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు రిటర్నింగ్ అధికారి మహేష్‌కుమార్ సిన్హా ప్రకటించారు. పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడేనికి చెందిన సోమసుందర్ ఉమ్మడి ఏపీలో ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షునిగా రెండు పర్యాయాలు పనిచేశారు.

### యోగాసన పోటీలను విజయవంతం చేయండి

**తాడేపల్లిగూడెం (టీఓసీ):** యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ వెస్ట్ గోదావరి వారి నిర్వహణలో ఈనెల 21 నుంచి 24 వరకు పెంటపాడు మండలంలోని ప్రత్తిపాడు సరస్వతి విద్యాలయం ఎడ్యుకేషన్ సొసైటీలో నిర్వహిస్తున్న ఏపీ రాష్ట్ర స్థాయి యోగాసన చాంపియన్ షిప్ పోటీలను విజయవంతం చేయాలని ఆరా ఫౌండేషన్ అధ్యక్షుడు, నేషనల్ యోగా కోచ్ కరిబండి రామకృష్ణ కోరారు. పట్టణంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఏపీ, యోగాసన భారత్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ పోటీలు జరుగుతాయని తెలిపారు. జూనియర్స్, సీనియర్స్, సీనియర్–ఏ, బి, సీ విభాగాల్లో బాల బాలికలు, పురుషులు, మహిళలు ఈ పోటీల్లో పాల్గొంటారన్నారు.



### మోటార్‌సైకిళ్లు ఢీకొని యువకుడి దుర్మరణం

మరో ఇద్దరికి తీవ్రగాయాలు



నక్క సందీప్ (19)

**పెనుగొండ:** రెండు మోటార్‌సైకిళ్లు ఎదురెదురుగా ఢీకొన్న ప్రమాదంలో ఒక యువకుడు మృతి చెందగా మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఆచంట పంచాయతీ పరిధి చాలెంజర్స్ కాలనీకి చెందిన నక్క సందీప్(19) పదో తరగతి వరకు చదువుకున్నాడు. తండ్రి సూరిబాబు వికలాంగుడు. ఆయన కిరాణా కొట్టు నడుపుతుండగా, తల్లి రత్నకుమారి అంగన్‌వాడీ ఆయాగా పనిచేస్తోంది. తండ్రికి చేదోడువాదోడుగా ఉంటున్న సందీప్ సోమవారం రాత్రి బయటకు వెళ్లి వస్తానని చెప్పి వెళ్లాడు. తన స్నేహితుడు ఆచంటకు చెందిన మంచుగంటి దొరబాబుతో కలిసి మోటార్‌సైకిల్‌పై వెళుతుండగా కుక్కల కోటి వీధి రామాలయం సమీపంలో ఎదురుగా వస్తున్న మరో మోటార్ సైకిల్‌ను ఢీకొన్నారు. తలకు బలమైన గాయం కావడంతో నక్క సందీప్ అక్కడికక్కడే మృతి చెందగా వెనుక కూర్చున్న దొరబాబు పరిస్థితి విషమంగా ఉన్నట్లు బంధువులు తెలిపారు. కాగా మరో వాహన చోదకుడు పాలకొల్లుకు చెందిన రమేష్ గాయాలయ్యాయి.

# నేటినుంచి కోర్టుల్లో ఉద్యోగాలకు పరీక్షలు

- ఏలూరులో రెండు, భీమవరంలో ఒకటి పరీక్షా కేంద్రాలు
- జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్.శ్రీదేవి వెల్లడి



ఎస్.శ్రీదేవి, జిల్లా ప్రధాన న్యాయమూర్తి, ఏలూరు

**ఏలూరు (టూటౌన్):** ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని కోర్టులలో స్టెనోగ్రాఫర్స్, టైపిస్ట్, కాపీయిస్ట్, డ్రైవర్, తదితర పోస్టులకు జారీ చేసిన నోటిఫికేషన్‌కు 4,207 మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారని, వీరికి ఈ నెల 20 నుంచి 24వ తేదీ వరకు పరీక్షలు నిర్వహిస్తున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్.శ్రీదేవి తెలిపారు. స్థానిక జిల్లా జడ్జి ఛాంబర్‌లో మంగళవారం పరీక్షల నిర్వహణ వివరాలు జిల్లా జడ్జి వెల్లడించారు. ఏలూరులోని సీఆర్ఆర్. ఇంజనీరింగ్ కాలేజీ, సిద్ధార్థ క్వెస్ట్ కళాశాల, భీమవరంలోని డీఎన్ఆర్ కళాశాల కేంద్రాల్లో ఈ పరీక్షలు జరుగుతాయన్నారు. పరీక్ష ఆన్‌లైన్ విధానంలో ఉంటుందన్నారు. ఈనెల 20, 21, 22, 24 తేదీల్లో మూడు షిఫ్టులలో, 23వ తేదీన రెండు షిఫ్టులలో పరీక్ష నిర్వహించడం జరుగుతుందన్నారు. అభ్యర్థులను నిర్దేశించిన సమయానికి 15 నిమిషాల ముందు మాత్రమే పరీక్షా కేంద్రంలోని అనుమతించడం జరుగుతుందన్నారు. విభిన్న ప్రతిభావంతులకు వారి విజ్ఞప్తి మేరకు స్క్రైబ్‌ని ఏర్పాటుచేయడం జరుగుతుందని, వారిని నిర్దేశించిన సమయం కన్నా 30 నిమిషాలు అదనపు సమయం ఇవ్వడం జరుగుతుందన్నారు. అభ్యర్థులు హాల్‌టికెట్‌తో పాటుగా తప్పనిసరిగా ఫోటో గుర్తింపు కార్డును తీసుకురావాలన్నారు. హాల్‌టికెట్ డౌన్‌లోడ్‌లో సాంకేతిక సమస్యలు, తదితర సమస్యల పరిష్కారం కోసం 0863–2372752 ఫోన్ నెంబర్‌తో హెల్ప్ లైన్ ఏర్పాటుచేయడం జరిగిందన్నారు. సమావేశంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె. రత్నప్రసాద్ పాల్గొన్నారు.

### అడుగేస్తే జారి పడాల్సిందే



ఇది అచ్యుతాపురం నుంచి త్రినాధపురం వెళ్లే ప్రధాన రహదారి. అడుగేస్తే జారిపడేంత ప్రమాదకరంగా ఉంది. మూడు నెలల క్రితం ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.10 లక్షలతో ఈ రోడ్డు నిర్మించారు. అంతలోనే ఇలా తయారైంది. కూటమి నాయకులే కాంట్రాక్టర్లుగా వ్యవహరించి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవడంతో రోడ్డు పరిస్థితి ఈవిధంగా తయారైందని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

– కొయ్యలగూడెం

### ఇరువురిపై కేసు నమోదు

**తాడేపల్లిగూడెం రూరల్:** వివాహేతర సంబంధానికి అడ్డువస్తున్న భర్తను భార్య, అతని ప్రియుడు కలిసి నిర్బంధించి, సెల్‌ఫోన్ పగులకొట్టినట్లు బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు రూరల్ హెచ్‌సీ జిలానీ మంగళవారం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని నీలాద్రిపురం గ్రామానికి చెందిన పుట్టా గోపీ అయ్యప్పకు 2013లో స్వాతితో వివాహమైంది. స్వాతి మాధవరం కోలాటానికి వెళ్లిన సందర్భంలో అదే గ్రామానికి చెందిన వన్నెంరెడ్డి నవీన్‌తో పరిచయం ఏర్పడింది. ఆమెతో చనువుగా ఉండటంతో పెద్దల సమక్షంలో పెట్టగా నవీన్‌ను మందలించారు. అనంతరం గోపీ అయ్యప్ప సొంత గ్రామం నీలాద్రిపురం నుంచి పెదతాడేపల్లి కాపురం వచ్చాడు. నాలుగు నెలల క్రితం వన్నెంరెడ్డి నవీన్ అయ్యప్ప ఇంటికి వచ్చి అతడిని బంధించి సెల్ ఫోన్ పగులకొట్టాడు. దీనిపై బాధితుడు గోపీ అయ్యప్ప సోమవారం రాత్రి రూరల్ పోలీసులకు నవీన్, స్వాతిలపై ఫిర్యాదు చేశాడు. దీనిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్‌సీ జిలానీ తెలిపారు.

## క్లుప్తంగా

### తెలుగుతేజం పురస్కారానికి ప్రసాద్ ఎంపిక


వీఎస్‌వీ ప్రసాద్

తణుకు అర్బన్: అభ్యుదయ రచయితల సంఘం మాజీ జిల్లా అధ్యక్షుడు, తణుకుకు చెందిన కవి వీఎస్‌వీ ప్రసాద్‌కు శ్రీశ్రీ కళా వేదిక తెలుగుతేజం పురస్కారానికి ఎంపికచేసింది. వ్యవహారిక భాషోద్యమ పితామహుడు గిడుగు రామమూర్తి జయంతిని పురస్కరించుకొని ఈ నెల 31వ తేదీన నరసరావుపేటలో నిర్వహించే కార్యక్రమంలో ఈ పురస్కారం అందజేయనున్నట్లు కవి ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ సీఈవో డాక్టర్ కత్తిమండ ప్రతాప్ కుమార్‌నుంచి ఆహ్వానం అందినట్లు చెప్పారు.

### 59 మందికి పౌష్టికాహారం అందజేత


పౌష్టికాహారం అందజేస్తున్న ఆర్గనైజేషన్ సభ్యులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): గుడ్ ల్యాంప్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న 50 మందికి ఆడిటర్ రవికుమార్ ఇచ్చిన ఆర్థిక సాయంతో పౌష్టికాహారం అందజేశారు. ఆర్గనైజేషన్ ప్రాజెక్ట్ డైరెక్టర్ డాక్టర్ టీఎస్ సుకుమార్, ఆర్గనైజేషన్ ప్రాజెక్ట్ మేనేజర్ జీసీకే మూర్తి, సిబ్బంది తదితరులు హాజరయ్యారు.

### 20 మంది వృద్ధులకు ఉచిత వైద్య సేవలు


ఉచిత వైద్య శిబిరంలో వైద్య సేవలందిస్తున్న వైద్యులు

తణుకు అర్బన్: సజ్జాపురం సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో 20 మంది వృద్ధులకు వైద్య సేవలు అందజేశారు. స్థానిక రాష్ట్రపతి రోడ్డులోని అసోసియేషన్ కార్యాలయంలో నిర్వహించిన ఈ శిబిరంలో సీనియర్ వైద్యులు డాక్టర్ భూపతిరాజు రమేష్‌చంద్రబాబు రోగులకు వైద్య సేవలందించి, ఆహార అలవాట్లు, వ్యాయామం, నడక వంటి విషయాలపై అవగాహన కల్పించారు. షుగర్, బీపీ పరీక్షలు ఉచితంగా నిర్వహించి నిరుపేద వృద్ధులకు ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు అడ్డాల సత్యనారాయణ తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ తణుకు శాఖ అధ్యక్షుడు ఈదర ప్రసాదరావు, ఉపాధ్యక్షుడు ద్వారంపూడి బాపిరెడ్డి, సభ్యులు ఇవటూరి లక్ష్మణరావు, చేబ్రోలు సాధు తదితరులు పాల్గొన్నారు.

### ఏపీ టీచర్స్ ఫోరం పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్‌ను ఆవిష్కరించిన ఉపాధ్యాయ సంఘాల నాయకులు

తణుకు అర్బన్: సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ విధానాన్ని అమలు చేయాలని డీఎస్సీ 2003 ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫోరం డిమాండ్ చేసింది. తణుకు జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఫోరం పోస్టర్‌ను ఉపాధ్యాయ సంఘాల నాయకులు మంగళవారం ఆవిష్కరించారు. దేశ వ్యాప్తంగా 16 రాష్ట్రాల్లో సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను అమలు చేయగా కేవలం ఏపీలో మాత్రమే కాలయాపన చేస్తున్నారని అన్నారు. ఇందుకు నిరసనగా ఈ నెల 25న విజయవాడ అలంకార్ సెంటర్‌లోని ధర్నా చౌక్ వద్ద మహా ధర్నాను నిర్వహించనున్నామని వివరించారు. కార్యక్రమంలో యూటీఎఫ్, పీఆర్‌టీయూ, ఎస్‌టీయూ జిల్లా నాయకులు ఎంసీహెచ్ వెంకటరావు, జె.వి జయకుమార్, ఎస్.వెంకటరాజు, ఎస్ఆర్ అప్పారావు, ఎస్‌వీవీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

### నేటి నుంచి ఆధార్ మొబైల్ క్యాంపులు

పాలకోడేరు: మండలంలో 0–6 సంవత్సరాల చిన్న పిల్లలకు రెండు విడతలుగా స్పెషల్ మొబైల్ ఆధార్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ వీవీ శ్రీనివాసరాజు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. 19, 20 తేదీల్లో పాలకోడేరు–1 గ్రామ సచివాలయం, కుముదవల్లి గ్రామ సచివాలయం వద్ద, 21, 22 తేదీల్లో గరగపర్రు గ్రామ సచివాలయం, గొల్లలకోడేరు గ్రామ సచివాలయం వద్ద, 23, 28 తేదీల్లో గోరగనమూడి గ్రామ సచివాలయం, వేండ్ర గ్రామ సచివాలయం వద్ద, 29, 30 తేదీల్లో శృంగవృక్షం –1గ్రామ సచివాలయం, కోరుకొల్లు గ్రామ సచివాలయం వద్ద క్యాంపులు నిర్వహిస్తాని స్పష్టం చేశారు.

# రహదారుల తీరు మారేదెప్పుడు?


కూటమి ప్రభుత్వం మరమ్మతులు చేసిన తరువాత ప్రత్తిపాడు-బాదంపూడి రహదారిపై ఏర్పడిన గోతులు


ప్రత్తిపాడు సెంటర్‌లో రహదారి పల్లమవడంతో నిలిచిన వర్షపు నీరు


నాణ్యతా లోపంతో నిర్మించిన పడమర విప్పర్రు-గణపవరం రహదారిపై లేచిన రాళ్లు

- వర్షాలతో మరింత అధ్వానం
- నాణ్యత లోపంతో కూటమి ప్యాచ్ వర్కులు
- మూన్నాళ్ల ముచ్చటగా మరమ్మతులు
- ఇబ్బందులు పడుతున్న వాహన చోదకులు

పెంటపాడు: గూడెంలో రహదారుల తీరు మారడం లేదు. కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాదిన్నర దాటింది. అయినా రహదారుల విషయంలో సరైన ప్రణాళిక లేదు. ప్రభుత్వం అధికారంలోకి వస్తే, ప్రధానంగా రహదారుల తీరు మారుస్తాం. గుంతలు లేని నాణ్యమైన రోడ్లు వేస్తాం. అంటూ ప్రగల్భాలు పలికి నేడు వాటి విషయంలో ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. ప్రధానంగా బాదంపూడి నుంచి ప్రత్తిపాడు, పెంటపాడు మండలంలో పలు రహదారులు గతం కన్నా మరింత గుంతలు పడి అధ్వానంగా తయారయ్యాయి. గత మూడు నెలల క్రితం ఈ రహదారులపై మరమ్మతులు చేశారు. దీనికి తోడు వర్షం తోడయ్యింది. ఎక్కడ గోతులు ఉన్నాయో వాహన చోదకులకు తెలియక ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇటీవల ప్రత్తిపాడు–బాదంపూడి మధ్య గూడెంలో ప్యాచ్‌వర్కులు చేశారు. కానీ గత వారం రోజుల నుంచి కురిసిన వర్షానికి పైపూతగా వేసిన తారు కొట్టుకుపోయింది.

**అసంపూర్తిగా రోడ్డు నిర్మాణం**

పెంటపాడు నుంచి విప్పర్రు మీదుగా గణపవరం వరకు రోడ్డు వేస్తున్నారు. కాగా ఆ రోడ్డు పూర్తి అవ్వలేదు. అసంపూర్తిగానే నిలిచిపోయింది. పైన కొంచెం పొరగా వేసిన తారు వర్షాకాలం రాకుండానే తొలగిపోయింది. కొన్ని చోట్ల రాళ్లు పైకి లేచి ఉండటంతో వాహనదారులు నానా అవస్థలు పడుతున్నారు. కూటమి ప్రభుత్వం వస్తే రహదారుల తీరు మారుతుందని ఎన్నికల ముందు కూటమి నాయకులు ప్రచారం హోరెత్తించారు. తీరా అధికారం చేపట్టిన తరువాత వాటి మరమ్మతులు తూతూమంత్రంగా చేపట్టి నాణ్యతా లోపంతో ప్రజా ధనాన్ని వృథా చేశారని పలువురు బాహాటంగానే విమర్శిస్తున్నారు. అయితే ప్రజలకు నిరాశే మిగిలిందని ప్రత్యక్షంగా ప్రజలే చెబుతున్నారు. వర్షాకాలం లోపే రహదారులు వేస్తామని చెప్పిన మాట నీటి మూట అయ్యిందని ప్రయాణికులు, ప్రజలు వాపోతున్నారు. ప్రధానంగా ప్రత్తిపాడు దుర్గమ్మ ఆలయం నుంచి సెంటర్‌కు వెళ్లే రహదారికి ఇటీవల మరమ్మతులు చేశారు. అయితే రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు గోతులు మరింత పెద్దవిగా తయారయ్యాయి. ఈ రహదారిలో క్వారీ లారీలు ఎక్కువగా తిరగడం వలన ప్యాచ్ వర్కులు పనిచేయలేదు. ఇప్పటికైనా నాణ్యతతో కూడిన మరమ్మతులు చేపట్టి, రహదారులను అభివృద్ధి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

### పోలీసులమంటూ బెదిరించి..

సాక్షి, టాస్క్ ఫోర్స్: పోలీసులమని చెప్పి మహిళ ఇంటిలోకి ప్రవేశించి డబ్బులు డిమాండ్ చేసిన కేసు లో నలుగురు పాత్రికేయులపై కేసు నమోదు చేసినట్లు రూరల్ పోలీసులు తెలిపారు. మంగళవారం వారు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని కుంచనపల్లి వాసవీ టౌన్ షిప్‌లో నివాసముంటున్న ఒక మహిళ ఇంటిలోకి మహేష్, ప్రకాష్, కళ్యాణ్, రాజశేఖర్ అనే పాత్రికేయులు ప్రవేశించి తాము పోలీసులమని చెప్పి ఆమె వద్ద నుంచి రూ.20 వేలు నగదు డిమాండ్ చేశారు. ఈ సంఘటన జూన్ 9వ తేదీన జరిగింది. అయితే, ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఆ వ్యక్తులను విచారించి సోమవారం రాత్రి ఈ మేరకు బాధితురాలు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై రూరల్ సీఐ బీబీ.రవికుమార్ ఆధ్వర్యంలో హెచ్‌సీ ఎండీ జిలానీ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

### మొబైల్ ఆధార్ నమోదు క్యాంపుల ఏర్పాటు

అత్తిలి: మండలంలో ఆధార్ మొబైల్ క్యాంపులను ఏర్పాటు చేసినట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో ఎం.శ్రీనివాసరావు తెలిపారు. ఆరు సంవత్సరాల లోపు పిల్లలకు ఆధార్ సీడింగ్ చేయించాలని కోరారు. మంగళవారం ఆరవల్లి, స్కిన్నెరపురం గ్రామాల్లో ఆధార్ నమోదు కార్యక్రమం నిర్వహించారు. 20న ఉనికిలి, కంచుమర్రు, ఈడూరు, 21న లక్ష్మీనారాయణపురం, మంచిలి, పాలూరు, 22న మంచిలి, కొమ్మర గ్రామాల్లో మొబైల్ క్యాంపులు నిర్వహిస్తామని తెలిపారు. 28న అత్తిలి, తిరుపతిపురం 29న ఉరదాళ్లపాలెం, అత్తిలి, 30న గుమ్మంపాడు, పాలి, కేఎస్ గట్టు గ్రామాల్లో ఆధార్ నమోదు కార్యక్రమం నిర్వహిస్తామని ఎంపీడీవో తెలిపారు.

# ఘనంగా ఫొటోగ్రఫీ దినోత్సవం


తణుకు అర్బన్: యూనియన్ అధ్యక్షుడు హరనాథరెడ్డిని సత్కరించిన ఫొటో గ్రాఫర్లు


తాడేపల్లిగూడెం: బస్టాండ్ వద్ద కెమెరా సృష్టికర్త డాగూరే చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఫొటో గ్రాఫర్లు

తణుకు అర్బన్: గడిచిన రోజుల తాలూకా మధురానుభూతులు, తీపి గుర్తులను భవిష్యత్ తరాలకు చూపించే ఒకే ఒక్క ఆధారం ఫొటో మాత్రమేనని సాహితీ సామ్రాజ్యం అధ్యక్షుడు తాడినాడ భాస్కరరావు అన్నారు. ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా మంగళవారం తణుకు శ్రీస్టూడియోలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అనంతరం అద్భుత సాధనం కెమేరా అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఫొటోగ్రాఫర్స్ యూనియన్ అధ్యక్షుడు సత్తి హరనాథ్ రెడ్డిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో స్టూడియో యజమానులు మావూరి నూకరాజు, కార్యదర్శి పెచ్చెట్టి సూర్యచంద్రరావు, కోశాధికారి సంతోష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

**తాడేపల్లిగూడెంలో..**

తాడేపల్లిగూడెం రూరల్: తాడేపల్లిగూడెం బస్టాండ్ వద్ద మంగళవారం ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం నిర్వహించారు. తొలుత కెమెరా సృష్టికర్త లూయిస్ డాగూరే చిత్రపటానికి తాడేపల్లిగూడెం ఏరియా ఫొటో, వీడియోగ్రాఫర్ల అసోసియేషన్ సభ్యులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మరడాని పరశురాం (రాము), ఏరియా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గంగాధర్, అయితం ప్రసాద్ మాట్లాడుతూ లూయిస్ డాగూరే, నిసెఫోర్ నిప్సే అభివృద్ధి చేసిన కెమెరాకు ఫ్రెంచ్ ప్రభుత్వం 1839 ఆగస్టు 19వ తేదీన ప్రపంచానికి బహుమతిగా ప్రకటించిందన్నారు. ఫొటో, వీడియోగ్రఫీ రంగంపై ఎంతో మంది ఆధారపడి జీవనం సాగిస్తున్నారని, వారికి డాగూరే దేవుడని పేర్కొన్నారు. కోశాధికారి మండ పవన్, ఉపాధ్యక్షుడు పెద్దోజు మురళీ, మానేపల్లి భానుప్రసాద్, సంయుక్త కార్యదర్శి పడాల శ్రీను, ఫొటోగ్రాఫర్ల అసోసియేషన్ పూర్వాధ్యక్షుడు చిరంజీవి, శ్రీనివాస్, బొల్లారపు సారాభాయ్, హనుమకొండ సత్యనారాయణ, జానీ, హనుమకొండ దానసూర్యనారాయణ, సాయి పాల్గొన్నారు.

# అర్బన్ హెల్త్ సెంటర్ల తనిఖీ


డోర్ టు డోర్ సర్వేను తనిఖీ చేస్తున్న ఉప మలేరియా అధికారి

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని వీకర్స్‌కాలనీ, కడకట్ల, బీబీ సెంటర్ జంక్షన్స్‌లోని అర్బన్ హెల్త్ సెంటర్స్‌ను ఉప మలేరియా అధికారి వై.నాగబాబు తనిఖీలు చేశారు. ఆయా సెంటర్స్‌లోని ల్యాబ్ రికార్డును పరిశీలించారు. కడకట్ల, వీకర్స్ కాలనీల్లో ఫీవర్ సర్వే ఎలా జరుగుతున్నాయో అడిగి తెలుసుకున్నారు. డోర్ టూ డోర్ సర్వేల్లో పాల్గొని, ప్రజల వద్ద నుంచి అభిప్రాయాలు సేకరించారు. ఆయా సెంటర్లలోని వైద్యులతో చర్చించారు. మలేరియా కిట్లు, ప్రజలకు అందుతున్న ఇతర సేవలను అడిగి తెలుసుకున్నారు. నాగబాబు మాట్లాడుతూ ప్రజలు దోమల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలిపారు. నివారణ పద్ధతులు పాటించడం ద్వారా దోమల వ్యాప్తి తగ్గి, మలేరియా, ఫైలేరియా, డెంగీ, చికున్‌గున్యా వంటి వ్యాధుల నుంచి దూరంగా ఉండొచ్చన్నారు. సబ్ యూనిట్ ఆఫీసర్ ఎస్‌వీఎస్ ప్రసాద్, హెల్త్ అసిస్టెంట్లు రామకృష్ణ, కాంతరావు, రాధాకృష్ణ, ఎల్‌టీ పృథ్వీ, ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

# ఎస్సీ వర్గీకరణపై ఆర్డినెన్స్‌ను రద్దు చేయాలి


నిరసన తెలుపుతున్న మాలమహానాడు నేతలు

తాడేపల్లిగూడెం (టీఓసీ) : ఎస్సీ వర్గీకరణపై రెండు తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు తెచ్చిన ఆర్డినెన్స్‌ను రద్దు చేయాలని, ప్రస్తుత పార్లమెంట్ సమావేశాలలో ఈ విషయంపై చర్చించాలని మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు చీకటిమిల్లి మంగరాజు డిమాండ్ చేశారు. పట్టణంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. తొలుత అంబేడ్కర్ విగ్రహానికి నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. మంగరాజు మాట్లాడుతూ మాల మాదిగలను విభజించడం సరికాదన్నారు. పార్లమెంట్‌లో అన్ని రాజకీయ పార్టీలకు చెందిన ఎంపీలు ఎస్సీ వర్గీకరణ వ్యతిరేకిస్తూ, రాజ్యాంగాన్ని పరిరక్షిస్తూ మాట్లాడాలన్నారు. జనాభా లెక్కలను త్వరితగతిన చేయాలని, ఆర్థికంగాను, సామాజికంగాను వెనకబడిన వర్గాలకు న్యాయం చేయాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎస్సీ వర్గీకరణ పేరుతో మాల, మాదిగలను విడగొట్టే పద్ధతి విడనాడాలన్నారు. ఎస్సీ రిజర్వేషన్ శాతాన్ని పెంచాలని తదితర డిమాండ్లను, ఆయా సమస్యలను ప్రస్తావించారు. రాష్ట్ర, జిల్లా నాయకులు బి.మోహన్, అచ్చుబాబు, ఏసురత్నం, ఫ్రీ బాబు, నాగేశ్వరరావు, రమణ, విజయకుమారి పాల్గొన్నారు.

# వయోజనుల అక్షరాస్యతకు కృషి


మాట్లాడుతున్న ఏపీడీ మల్లిఖార్జునరావు

తాడేపల్లిగూడెం రూరల్: వయస్సు పైబడిన నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తున్నట్లు డ్వామా ఏపీడీ జీవీకే మల్లిఖార్జునరావు అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో అక్షరాంధ్ర–అక్షరాస్యత కార్యక్రమంపై ఎన్ఆర్ఈజీఎస్ వలంటీర్లకు మండల స్థాయి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లిఖార్జునరావు మాట్లాడారు. జిల్లా నోడల్ అధికారి కేవీవీ సత్యనారాయణ మాట్లాడుతూ మండలంలో డ్వామా గ్రూపుల్లో ఉన్న వెయ్యి మంది నిరక్షరాస్యులైన పురుషులను గుర్తించి, వారికి ప్రతీ పది మందికి లెర్నర్‌లకు ఒక్కో వలంటీర్‌ను ఏర్పాటు చేశామన్నారు. మండలంలో వెయ్యి మంది వలంటీర్లను నియమించినట్లు తెలిపారు. ఆగస్టు నుంచి మార్చి వరకు అక్షరాస్యత కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. మార్చి నెలాఖరున లెర్నర్స్‌కు పరీక్ష నిర్వహించనున్నామన్నారు. ఎంపీడీవో ఎం.వెంకటేష్, ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది, వలంటరీ టీచర్లు పాల్గొన్నారు.

### పాలసీల పునరుద్ధరణకు వెసులుబాటు

తణుకు అర్బన్: ఎల్ఐసీ పాలసీల ప్రీమియమ్స్ సకాలంలో చెల్లించకపోవడంతో తాత్కాలికంగా రద్దయిన పాలసీల పునరుద్దరణకు ప్రత్యేక వెసులుబాటు కల్పిస్తూ లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎల్ఐసీ) చక్కటి అవకాశాన్ని ఇచ్చిందని ఎల్ఐసీ తణుకు బ్రాంచ్ ఏజెంట్ల యూనియన్ (ఏవోఐ) అధ్యక్షుడు సలాది ఉదయ భాస్కరరావు తెలిపారు. ఈ నెల 18 నుంచి అక్టోబర్ 17వ తేదీ వరకు రద్దయిన పాలసీలకు జీవం పోసే ప్రత్యేక వెసులుబాటు కల్పిస్తూ స్పెషల్ రివైవల్ క్యాంపెయిన్‌ను ఎల్ఐసీ ప్రకటించినట్లు చెప్పారు. పాలసీల పునరుద్దరణ కోసం అపరాధ రుసుంపై ప్రత్యేక వడ్డీ రాయితీ ఇస్తుందని ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రత్యేక వడ్డీ రాయితీ నాన్ లింక్ బీమా పాలసీలకు 30 శాతం లేదా గరిష్ఠంగా రూ.5 వేల వరకు వడ్డీ రాయితీ ఉంటుందని, సూక్ష్మ బీమా పాలసీలకు ప్రత్యేక వడ్డీ రాయితీ మినహాయింపు ఇస్తుందన్నారు. ప్రీమియంలు చెల్లించడం ఆపేసి ఐదు సంవత్సరాలు మించకపోతేనే పాలసీల పునరుద్ధరణ సాధ్యమవుతుందని వివరించారు.

# వైద్య శిబిరంలో 135 మందికి కంటి పరీక్షలు


ఉచిత వైద్య శిబిరంలో కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

అత్తిలి: లయన్స్ క్లబ్ ఆఫ్ అత్తిలి ఆధ్వర్యంలో నిడదవోలు ఆర్ఆర్ లలయన్స్ కంటి ఆసుపత్రి సహకారంతో అత్తిలి మండలం ఉరదాళ్లపాలెం గ్రామంలో ఉచిత మెగా కంటి వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని వంక రాజకుమారి ప్రారంభించారు. లయన్స్ స మాజీ గవర్నర్ ఎం.బాపూజీరావు ఆర్థిక సాయం అందించారు. ఈ శిబిరంలో 135 మందికి కంటి పరీక్షలు చేశారు. వారిలో 18 మందికి ఆపరేషన్లు అవసరమని తెలిపారు. 35 మందికి కళ్లజోళ్లు అందజేశారు. 26 మందిని ప్రత్యేక చికిత్స నిమిత్తం నిడదవోలు కంటి ఆసుపత్రికి రిఫర్ చేశారు. అనంతరం 18 నెలల పాప కూసంపూడి సాద్వికకు గుండె ఆపరేషన్ నిమిత్తం క్లబ్ సభ్యులు వంక రాజకుమారి చేతుల మీదుగా రూ.77 వేల ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు శిరగాని నాగేశ్వరరావు, కార్యదర్శి చిట్టాల బాల మురళీకృష్ణ, కోశాధికారి వర్ధినీడి వెంకట శివ, జోనల్ చైర్ పర్సన్ పట్నాల వెంకటేశ్వరరావు ఉలుసు భాస్కరరావు, దాసం బాబ్జీ, యాతం రాంబాబు, శింగంశెట్టి రవి తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలు అప్రమత్తంగా ఉండాలి


అధికారులు, సిబ్బందితో సమీక్షిస్తున్న మున్సిపల్ కమిషనర్ ఏసుబాబు

తాడేపల్లిగూడెం: అల్పపీడన ప్రభావంతో రానున్న మూడు రోజుల్లో వానలు విస్తారంగా కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ కమిషనర్ ఎం.ఏసుబాబు అన్నారు. ఈ మేరకు సోమవారం కమిషనర్ అధికారులు, సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. లోతట్టు ప్రాంతాల్లో నీరు నిల్వ లేకుండా, మురుగు కాలువల ప్రవాహానికి అడ్డంకులు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పల్లపు ప్రాంతాల్లో నీరు నిల్వ ఉంటే మోటార్ల సాయంతో వెంటనే తోడించాలన్నారు. కాలువలపై ఆక్రమణలు తొలగించాలని, పురాతన భవనాల యజమానులకు నోటీసులు ఇవ్వాలని ఆదేశించారు. సచివాలయ సిబ్బంది మూడు షిఫ్టుల్లో విధులకు హాజరు కావాలన్నారు. మున్సిపల్ ఇంజనీర్ వై.వెంకట రమణ, ఏసీపీ సీతారాం, మేనేజర్ రవిసుధాకర్, టీపీఓ జగదీశ్వరరావు, హెల్త్ ఆఫీసర్ రాజు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సోమేశ్వరరావు హాజరయ్యారు.

# బ్యాంకుల ప్రైవేటీకరణ చర్యలు ఆపాలి


మాట్లాడుతున్న బ్యాంక్ ఉద్యోగ సంఘాల నాయకులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): ప్రభుత్వ బ్యాంకుల ప్రైవేటీకరణ ప్రయత్నాలను కేంద్ర ప్రభుత్వం ఆపాలని బ్యాంక్ ఉద్యోగుల కోఆర్డినేషన కమిటీ కన్వీనర్ ఎస్.ఎస్.ప్రసాద్, ఏపీజీబీ గూడెం మేనేజర్ కె.ఆశాజ్యోతి, ఆర్‌పీజీబీ ఉద్యోగ సంఘం నాయకులు జేఎస్‌వీఎస్ ప్రసాద్, లింగంపల్లి గాంధీ, ఎండీ షరీఫ్ పేర్కొన్నారు. పట్టణంలో మంగళవారం యూనియన్ సభ్యులతో నిర్వహించిన సమావేశంలో వక్తలు మాట్లాడుతూ లాభాల్లో ఉన్న సంస్థలను కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం ప్రైవేటీకరణ చేయడం దేశ ఆర్థికాభివృద్ధికి నష్టదాయకమన్నారు. ప్రభుత్వ బ్యాంక్‌లను నిర్వీర్యం చేస్తే యూనియన్లు చూస్తూ ఊరుకోవని, ఉద్యోగ సంఘాలతో సమ్మె కార్యాచరణ చేస్తామని, ఉద్యమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో లక్ష్మీప్రసన్న, శిరీష, రాధాకృష్ణ, రాము, బి.ఏడుకొండలు, పాలూరి సత్యనారాయణ, వీరబాబు, సుధీర్, సిద్దాబత్తుల సూర్యనారాయణ, ప్రసాద్, మూర్తి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# ఉమా మూలేశ్వర స్వామికి లక్షపత్రి పూజ

వీరవాసరం: మండలంలోని రాయకుదురు శ్రీ ఉమా మూలేశ్వర స్వామి వారి దేవస్థానంలో ఆరుద్ర నక్షత్రం సందర్భంగా మంగళవారం స్వామి వారికి లక్షపత్రి పూజ నిర్వహించారు. ముందుగా పంచామృత అభిషేకాలు, ఏకాదశ రుద్రాభిషేకం, ప్రత్యేక హోమాలు చేపట్టారు. నుదురుపాటి కోదండ రామమూర్తి–సీతా మహాలక్ష్మి వేద పరిరక్షణ సమితి రాయకుదురు, హైదరాబాదు వారి సంయుక్త ఆధ్వర్యంలో నుదురుపాటి బాలగంగాధర శాస్త్రి వారి కుటుంబ సభ్యులతో పూజలు చేశారు. కార్యక్రమంలో నుదురుపాటి భానుమూర్తి, నుదురుపాటి రామం, అడ్డాల బాబీ పాల్గొన్నారు.

### గ్రంథాలయాల అభ్యున్నతికి కృషి చేయాలి


గ్రంథాలయంలో శ్రీనివాసరావును సత్కరిస్తున్న రిసోర్స్ పర్సన్లు

తాడేపల్లిగూడెం (టీఓసీ): గ్రంథాలయ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పలువురు వక్తలు అన్నారు. స్థానిక గ్రేడ్–1 శాఖా గ్రంథాలయం ఉన్నతికి పాటుపడుతున్న గ్రంథాలయ అధికారి వి.శ్రీనివాసరావును పలువురు అభినందించారు. ఇటీవల శ్రీనివాస్‌రావు జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. మంగళవారం స్థానిక గ్రంథాలయంలో ఆయనకు అభినందన సభ నిర్వహించి, సత్కరించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ గ్రంథాయ అభివృద్ధి కార్యక్రమాలు, సభ్యత్వాల నమోదు, ఇతర సేవలను కొనియాడారు. పలువురు రిసోర్స్ పర్సన్లు గరికిపాటి బాపయ్య శర్మ, ప్రత్తి వీరాస్వామి, ఏవీ లక్ష్మణరావు, ఎ.జనార్దనరావు, వి.జాన్‌బాబు, కేవీ సత్యప్రకాశ్, టీచర్ శ్యామలరావు, పాఠకులు తదితరులు గ్రంథాయాధికారి శ్రీనివాసరావును అభినందించారు.

### పేకాట స్థావరంపై దాడి

కాళ్ల: పేకాట స్థావరంపై దాడిచేసి పది మంది వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు కాళ్ల ఎస్సై మంగళవారం విలేకరులకు తెలిపారు. ఆయన తెలిపిన వివరాలప్రకారం మండలంలోని కలవపూడి శివారు మోడిలో పేకాడుతున్నారనే సమాచారం మేరకు సిబ్బందితో కలిసి దాడి చేశామని పేర్కొన్నారు. ఈ దాడిలో పది మంది వ్యక్తులను అరెస్ట్ చేసి వారి వద్ద రూ.2,700/- నగదు స్వాధీనం చేసుకున్నామని వివరించారు.

### రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలు

భీమవరం: ఆసుపత్రిలో చికిత్స పొంది ర్యాపిడో మోటార్ సైకిల్‌పై ఇంటికి వెళుతున్న మహిళను మరో మోటార్ సైకిల్ ఢీకొట్టిందని భీమవరం టూటౌన్ ఏఎస్సై ఎస్.వెంకటరావు తెలిపారు. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని మల్టీప్లెక్స్ వెనుకగల యాదవుల వీధికి చెందిన వెలుగుల కనకమహాలక్ష్మి ఈనెల 18న భీమవరం ప్రైవేటు ఆసుపత్రిలోని చికిత్స అనంతరం ర్యాపిడో మోటార్ సైకిల్‌పై వెళుతుండగా వేగంగా వస్తున్న మరో మోటార్ సైకిల్ ఈమె ప్రయాణిస్తున్న ర్యాపిడో మోటార్ సైకిల్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆమె గాయపడడంతో చికిత్స కోసం ప్రైవేటు ఆసుపత్రిలో చేరింది. ఈ మేరకు కేసు నమోదు చేసిన దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్సై వెంకట్రావు తెలిపారు.